సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం। 2। ఫిబ్రవరి। 2025



విరబూసిన పద్మాలు
పద్మశ్రీ అవార్డుతో తాడేపల్లిగూడెం ప్రాంతానికి విడదీయలేని అనుబంధం. ఈ ప్రాంతానికి చెందిన పలువురు విభిన్న రంగాల్లో **పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.** IIలో ▸



ప్లాస్టిక్ నిషేధం
భీమవరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించామని, అమలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. IIలో ▸



భక్తుల రద్దీ సాధారణం
ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. తూర్పు రాజగోపుర ప్రాంతం తదితర ప్రాంతాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు.

న్యూస్‌రీల్

కేసులను త్వరగా విచారించాలి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సురేష్‌రెడ్డి

ఏలూరు(టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి శనివారం ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో జ్యూడిషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేసులను త్వరితగతిన విచారించి తీర్పులు వెలువరించాలని, తీర్పుల్లో నాణ్యత లోపించ కూడదన్నారు. సివిల్ కేసులు, విచారణలో ఉన్న ఖైదీల కేసుల్లో త్వరితగతిన తీర్పులను వెలువరించడానికి ప్రయత్నించాలని సూచించారు. ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్ ఉమ్మడి జిల్లాలో పెండింగ్ కేసుల వివరాలు, భవన సముదాయాల పరిస్థితులపై ఆయన వివరించారు. జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

సదస్సుల్లో అర్జీలను వేగంగా పరిష్కరించాలి



సమీక్షిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామసభల్లో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ సదస్సులు, రీసర్వే, 22–ఏ ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ అంశాలపై సమీక్షించారు. ఆయా అంశాల్లో త్వరితగతిన పురోగతి సాధించాలని ఆదేశించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం
భీమవరం: కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆశలను అడియాసలు చేసిందని, బీజేపీ మరోసారి ద్రోహం చేసిందని, ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ కోరారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపినా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాత్రం బడ్జెట్ గొప్పగా ఉందనడం సిగ్గుచేటని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి మాట్లాడకపోవడం ప్రజలను మోసం చేయడమే అని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పునరావాసం, పరిహారం ప్యాకేజీ గురించి స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. జిల్లాకు మేలు చేసిందేమీ లేదని గోపాలన్ పేర్కొన్నారు.

కోడ్ అమలుకు ప్రత్యేక బృందాలు
ఏలూరు(మెట్రో): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలుకు ప్రత్యేక బృందాలను నియమిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. 22 ఎంసీసీ, 21 స్పెషల్ వీడియో బృందాలు ఏర్పాటుచేశారు. భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, నిడమర్రు, పెదపాడు, పెదవేగి, చింతలపూడి, ఉంగుటూరు, లింగపాలెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం అర్బన్, రూరల్, బుట్టాయగూడెం, ద్వారకాతిరుమల, కుక్కునూరు, టి.నరసాపురం, కొయ్యలగూడెం మండలాలకు ఒక్కో బృందం, ఏలూరు కార్పొరేషన్‌కు రెండు ఎంసీసీ బృందాలను ఏర్పాటుచేశారు. వీరు రోజువారీ నివేదికలను ఆర్డీఓలకు సమర్పించాలని పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్ నిలుపుదల
ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు కలెక్టరేట్, ఆర్డీఓ, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కార్యక్రమాన్ని నిలుపుదల చేసినట్టు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు
ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ సన్నాహక పరీక్షల్లో భాగంగా శనివారం ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహించిన ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షకు 17,849 మంది హాజరయ్యారు. జిల్లాలోని 137 కళాశాలల్లో జనరల్ విద్యార్థులు 15,999 మందికి 15,590 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,459 మందికి 2,259 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు.

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి

కేంద్ర బడ్జెట్‌లో యథావిధిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు మొండిచేయి చూపారు. పోలవరం ప్రాజెక్టుకు కొద్దిగా నిధుల మంజూరు, వేతన జీవులకు శ్లాబ్ పెంపు మినహా ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. వ్యవసాయ, ఆక్వా రంగాలకు ప్రోత్సాహాలు దక్కని పరిస్థితి. రైల్వే ప్రాజెక్టుల ఊసేలేదు. జిల్లా రూపురేఖలు మారుస్తాం అంటూ కూటమి నేతల హడావుడి తప్ప కార్యరూపం దిశగా కనీసం యోచించే పరిస్థితి లేదు.

మరోసారి నిరాశే..
- జిల్లాకు దక్కని ప్రాధాన్యం
- ఆర్అండ్ఆర్ ఊసెత్తని వైనం
- ఆక్వా, వ్యవసాయ, లేసు ఉత్పత్తులకు దక్కని ప్రాధాన్యం
- రైల్వే ప్రాజెక్టులపై స్పష్టత కరువు
- పోలవరానికి రూ.5,936 కోట్ల కేటాయింపు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి జిల్లావాసులు కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నా ఏటా మాదిరిగా నిరాశే ఎదురైంది. జిల్లాలో ఆక్వా సాగు, ఎగుమతుల వ్యాపారంతో పాటు వాణిజ్య పంటలైన పొగాకు, కోకో, ఆయిల్‌పామ్ సాగు అధికంగా ఉంది. అలాగే తాడేపల్లిగూడెంలో నిట్ విద్యాసంస్థ, నరసాపురం అంతర్జాతీయ ఎగుమతి ఖ్యాతి ఉన్న లేసు పరిశ్రమలు ఇలా పలు రంగాలు కేంద్ర ప్రోత్సాహకాలు, సుంకాల రద్దు కోసం ఎదురుచూస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. కేంద్రసహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్రం నిధులతో పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు జిల్లాను అభివృద్ధి చేస్తానని చెప్పినా ఆచరణలో కనిపించని పరిస్థితి.

'ఆక్వా'ంక్షలు ఫలించలేదు
ఉమ్మడి జిల్లాలో 2.40 లక్షల ఎకరాలలో ఆక్వా సాగు ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా సుమారు 4 లక్షల మంది దీనిపై ఆధారపడి ఉన్నారు. ఏటా సుమారు 20 వేల కోట్ల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఆక్వా, అనుబంధ పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. బడ్జెట్‌లో ఆక్వా రైతులకు ప్రోత్సాహకాలు, ఫిషింగ్ హార్బర్, ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రతిపాదనలను పట్టించుకోలేదు. చేప ముక్కలు శీతలీకరణం చేసి ఎగుమతి చేస్తే గతంలో 30 శాతం ఉన్న కస్టమ్స్ డ్యూటీను 5 శాతానికి తగ్గించినా రైతులకు ఉపయోగం లేదు.

వ్యవ'సాయానికి' దక్కని మద్దతు
ఉమ్మడి జిల్లాలో ఏటా సుమారు 10 లక్షల ఎకరాల్లో సుమారు 4.20 లక్షల మంది రైతులు పలు రకాల పంటలు పండిస్తున్నారు. పంటలకు మద్దతు ధర ప్రకటించకపోవడం, ఎరువులపై సబ్సిడీ పెంపు, మద్దతు ధరలపై గ్యారంటీ అమలు చట్టం వంటి డిమాండ్ల నెరవేరలేదు. ఆయిల్‌పామ్, కోకో మొక్కలకు పూర్తి సబ్సిడీ డిమాండ్ పట్టించుకోలేదు. జిల్లాలో 5.30 లక్షల మంది పన్ను చెల్లింపుదారులకు ఆదాయపన్ను శ్లాబ్ పెంచడంతో ఊరట లభించింది. జిల్లాలో వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు టీడీఎస్ భారం తగ్గింది

నరసాపురం లేసుకు దక్కని గుర్తింపు
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మెట్టినిల్లు నరసాపురం లేసు పరిశ్రమ అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందినా కేంద్ర ప్రభుత్వం గుర్తించని పరిస్థితి. లేసు ఎగుమతులు పదేళ్ల కిత్రం ఏటా రూ.200 కోట్లు ఉండగా కొన్నేళ్లుగా రూ.80 కోట్లకు తగ్గాయి. నరసాపురం లేసుకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్నా ముడి సరుకుపై పన్నుల మినహాయింపు, ఎగుమతి సుంకాల రద్దు, కేంద్ర ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అందడం లేదు. దీంతో సులభంగా మార్కెటింగ్ చేయలేక పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. బడ్జెట్‌లో అల్లికల దుస్తులపై 10 శాతం పన్నును 20 శాతానికి పెంచడం అదనపు భారం. తాడేపల్లిగూడెం నిట్‌కు ఏటా రూ.250 కోట్లు కేటాయించాల్సి ఉన్నా అటకెక్కించారు.

ఆర్అండ్ఆర్‌కు నిల్
పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు, ప్రాజెక్టు అథారిటీకి రూ.54 కోట్లు కేటాయించారు. కీలకమైన ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మూడు ముంపు మండలాల్లోని 126 గ్రామాలకు చెందిన దాదాపు 25,100 కుటుంబాలను పునరావాస ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. సుమారు రూ.32 వేల కోట్లకుపైగా పునరావాసానికి కేటాయించాల్సి ఉండగా పట్టించుకోలేదు. పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తుతోనే పూర్తిచేసేందుకే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి 45.72 మీటర్ల ఎత్తుతో పోలవరం ప్రాజెక్టును నిర్మించాల్సి ఉంది.

రైల్వేకు కేటాయింపుల్లేవు
జిల్లాలో నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్‌ను 2016లో ప్రారంభించినా నిధులు మంజూరు కాక నిలిచిపోయాయి. అలాగే రూ.923 కోట్లతో కొవ్వూరు–భద్రాచలం రైల్వేలైన్ ఆమోదముద్ర వేసినా బడ్జెట్ కేటాయింపులు లేవు. ఈ బడ్జెట్‌లో అయినా ఏ మేరకు కేటాయింపులు చేశారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

లేసుకు ప్రోత్సాహకాలు కరువు



ప్రపంచ ఖ్యాతిగాంచిన నరసాపురం లేసు పరిశ్రమకు బడ్జెట్‌లో ప్రోత్సాహం ఇస్తారని భావించాం. అయితే నిరాశే ఎదురైంది. కొన్ని నిర్ణయాల కారణంగా లేసు ఎగుమతులు మరింత భారమవ్వడం, ప్రొడక్షన్ కాస్ట్ పెరగడం వంటివి జరుగుతాయనే సంకేతాలు ఆందోళన కలిగిస్తోంది. లేసు ఎగుమతులకు చైనా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నాం. కేంద్ర ప్రోత్సాహకాలు లేకపోతే పరిశ్రమ మనుగడ కష్టం.
– కావలి నాని, అంతర్జాతీయ లేసు ఎగుమతిదారుడు, నరసాపురం

పేదలకు వ్యతిరేకంగా బడ్జెట్



కేంద్ర బడ్జెట్ పూర్తిగా పేదలకు వ్యతిరేకంగా ఉంది. రైతులు, దళితులు, బడుగు, బలహీన వర్గాలకు మొండిచేయి చూపారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ ఊసేలేదు. ధరల స్థిరీకరణకు నిధులు కేటాయింపులు లేవు. కార్మిక సంక్షేమం మాటలేదు. నిరుద్యోగ సమస్య నిర్మూలన, యువతకు ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం లేదు.
– కోనాల భీమారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి, భీమవరం

పన్ను రాయితీ హర్షణీయం



బడ్జెట్‌లో ఆక్వా ఎగుమతులపై పన్ను రాయితీ ప్రకటించడం హర్షణీయం. అయితే రాయితీలు హేచరీలు, ఫీడ్ తయారీ కంపెనీలకు మాత్రమే చేరుతున్నాయి. రైతుల వరకూ చేరేలా చూడాలి. గతంలో రాయితీలు ప్రకటించినా రైతులకు ప్రయోజనం చేకూరలేదు. ఇప్పుడైనా కేంద్ర ప్రభుత్వ ఫలాలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలి.
– గాదిరాజు వెంకట సుబ్బరాజు, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి,

ప్రజారంజకంగా బడ్జెట్



బడ్జెట్ ప్రజారంజకంగా ఉంది. ఆరోగ్య రంగంలో కీలక నిర్ణయాలు తీసుకుని అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ ఆస్పత్రులు ఏర్పాటు చేయనుండటం అభినందనీయం. ఆదాయ పన్నుపై రూ.12 లక్షల వరకు మినహాయింపు మేలు చేస్తుంది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారు.
– ఐనంపూడి శ్రీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

నిర్వాసితులకు అన్యాయం



పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులపై కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోంది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సుమారు రూ.32 వేల కోట్లు అవసరమైనా కేటాయింపులు లేవు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీకి నిధులు ఇవ్వలేదు.
– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు

పరిశోధనలపై ఆసక్తి



ఐఐటీ, ఐఐఎస్‌సీల్లో 10 వేల మంది విద్యార్థులకు ఫెలోషిప్ ప్రకటించడంతో పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుంది. సుమారు 10 వేల మెడికల్ సీట్లు పెంచడం సంతోషదాయకం. ఎంఎస్ఎంఈ, స్టార్టప్ కంపెనీల అభివృద్ధికి రుణాలు మంజూరుతో నూతన పారిశ్రామికవేత్తలు ఎదుగుతారు.
– డాక్టర్ తేర రాజేష్, ఎంబీఏ ఆచార్యులు, సీఆర్ రెడ్డి పీజీ కళాశాల, ఏలూరు

రైతులకు రిక్తహస్తం



బడ్జెట్‌లో రైతులకు మొండిచేయి చూపారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టంపై హామీ ఇవ్వకపోవడం రైతులను మోసగించడమే. ఎరువులు సబ్సిడీ మరింత పెంచాలి. పోలవరం ప్రాజెక్టుకి నామమాత్రపు కేటాయింపులతో ప్రయోజనం లేదు.
-కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, నియోజకవర్గ ఇన్‌చార్జులు పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపి

కాళ్ల: కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను వేధించడానికి నిరసనగా ఈనెల 5న వైఎస్సార్‌సీపీ ఫీజుపోరు కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పెద అమిరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద పిల్లలపై కక్ష సాధింపునకు సీఎం చంద్రబాబు దిగారని విమర్శించారు. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటంతో విద్యార్థులను ఫీజులను చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో దివంగత వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకువచ్చారని, ఆయన మరణానంతరం 2014–19 కాలంలోనూ చంద్రబాబు సర్కారు ఈ పథకానికి తిలోదకాలు ఇచ్చిందన్నారు.

జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు
2019లో జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ఫీజు పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ముదునూరి అన్నారు. మరలా సీఎం చంద్రబాబు ఫీజు పథకంపై కుట్రలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరం డిసెంబర్ త్రైమాసికం వరకు రూ.12,609 కోట్లు విద్యాదీవెన పథకానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. మొత్తంగా విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు రూ.18 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.2,500 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.1,100 కోట్లు వసతి దీవెన వంటి పథకాలను పెండింగ్‌లో పెట్టారన్నారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని ముదునూరి హెచ్చరించారు. ఈనెల 5న ఫీజు పోరు కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపి, నాయకులు బంధన పూర్ణచంద్రరావు, పేరిచర్ల నరసింహారాజు, కామన నాగేశ్వరరావు, చిగురుపాటి సందీప్, గాదిరాజు రామరాజు కోడే యుగంధర్, బట్టు ఏసురాజు, వేగేశ్న జయ రామ కృష్ణంరాజు పాల్గొన్నారు.

వీడని ఎస్సై ఆత్మహత్య మిస్టరీ

- విషయమంతా ఫోన్‌లోనే..!
- వేధించిన ఉన్నతాధికారి ఎవరు ?
- ఎస్సై ఆత్మహత్యపై అనుమానాలెన్నో..



తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మూర్తి ఆత్మహత్య చేసుకున్న ప్రాంతం

తణుకు అర్బన్: తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆత్మహత్య చేసుకున్న వ్యవహారం మిస్టరీగా మారింది. ఆ రోజు ఏం జరిగింది.. ముందు రోజు రాత్రంతా ఏం ఆలోచించారు.. సీఎం బందోబస్తులో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మరీ ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చింది.. సీసీ పుటేజీ ప్రకారం టాయిలెట్స్ ప్రాంతంలో ఎవరితో చాటింగ్ చేశారు.. ఒకవేళ పైఅధికారుల వేధింపులే అయితే ఆ అధికారి ఎవరనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఎస్సై ఆత్మహత్యతో ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. పోలీసుల పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం ఎస్సై భౌతికకాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

కీలకంగా ఎస్సై ఫోన్ : సంఘటన జరిగిన వెంటనే ఎస్సై ఫోన్‌ను స్వాధీనం చేసుకోమని రూరల్ స్టేషన్ సిబ్బందికి ఆదేశాలివ్వడం, నిబంధనల పేరుతో ఘటనా ప్రాంతాన్ని నిర్బంధించడం వంటి అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఘటన జరిగే ముందు ఎస్సై మూర్తి ఉపయోగించిన ఫోన్‌లో కీలక సమాచారం ఉందని బంధువులు, స్నేహితులు చెబుతున్నా.. పోలీసు అధికారులు ఫోన్ వ్యవహారాన్ని బయటపెట్టకపోవడం వెనుక కీలకమైన విషయం ఉందనే చర్చ నడుస్తోంది. ఫోన్‌లో ఉన్న మిస్టరీని పోలీసులు బహిరంగ పరిచి వేధింపులకు గురిచేసిన అధికారిని బయటపెడతారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గేదెల చోరీ సంఘటనే కారణమా..
గతేడాది నవంబరులో తణుకు మండలం వేల్పూరులో రెండు గేదెల చోరీ కేసుకు సంబంధించి తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సెటిల్‌మెంట్ వ్యవహారంలో ఎస్సై మూర్తి లేకపోయినా ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం, వీఆర్‌కు పంపడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారా లేక మరే కారణాలు ఉన్నాయా అన్నది తేలాల్సి ఉంది. పోలీసుల విచారణలో ఏమి తెలుస్తారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గేదెల చోరీ కేసులో ఉన్నతాధికారులకు సైతం ఎస్సై మూర్తి భారీగా ముట్టజెప్పినట్టు అప్పట్లో ఆరోపణలు వినిపించాయి.

ధైర్యంగా నిలబడే వ్యక్తి



సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడే వ్యక్తి ఇలా ఆత్మహత్య చేసుకున్నారంటే నమ్మలేకపోతున్నాను. ఆయన స్నేహానికి విలువిచ్చే వ్యక్తి. వెయ్యి మందికి సమాధానం చెప్పగలడు. పోలీసు ఉద్యోగమే వ్యసనంగా భావించే వారు. మాకు ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ ధైర్యం చెప్పే వ్యక్తి ఇక లేరంటే నమ్మలేకపోతున్నాం.
– వెంకటరమణ, కె.గంగవరం, తూర్పుగోదావరి జిల్లా

ఒత్తిడి పెరిగింది అనే వారు



కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులు, అధికారులపై ఒత్తిడి పెరిగిందని, మనశ్శాంతిగా విధులు నిర్వర్తించలేకపోతున్నామని ఎస్సై మూర్తి అనేవారు. కోర్టులో కలిసిన సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేసేవారు. గేదెల చోరీ ఘటనలో సస్పెండ్ చేయడాన్ని జీర్ణించుకోలేకపోయారు. జుడీషియల్ విచారణ, ఉన్నతాధికారుల ఒత్తిడితో ఇబ్బంది పడ్డారు.
– వెలగల సాయిబాబారెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు, తణుకు

తీరంలో తాబేళ్ల మృతిపై విచారణ



అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): మృతి చెందిన తాబేళ్ల సంఘటనపై వెంటనే విచారణ చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అటవీ, మత్స్యశాఖల అధికారులతో సమావేశమై మృతిచెందిన తాబేళ్ల చినమైనివారిలంక, పెద్ద మైనివారిలంక తీర ప్రాంతానికి కొట్టుకు రావడానికి కారణాలపై సమీక్షించారు. పర్యావరణ హితమైన సముద్ర జీవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలోని తీర ప్రాంతానికి పదుల సంఖ్యలో మృత తాబేళ్లు కొట్టుకురావడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. అటవీ, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులతో విచారణ బృందాన్ని నియమించినట్టు చెప్పారు. తాబేళ్లు గుడ్లు పెట్టే అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు వలలను నిషేధించాలని మత్స్యకారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశాకిరణ్, మత్స్యశాఖ సహాయ సంచాలకుడు సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ : కాళ్ల: కోపల్లె ఎస్సీ కాలనీ, కాళ్ల బీసీ కాలనీలో పలువురు లబ్ధిదారులకు కలెక్టర్ నాగరాణి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకుని, ప్రతినెలా పింఛన్ పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై దృష్టి
భీమవరం: ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై తల్లిదండ్రులు, వెనుకబడిన కులాలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, పాఠశాలలు పునర్వ్యవస్థీకరణపై సమీక్షించారు.

ఫుడ్ కోర్టు వద్దు.. బయటి ఫుడ్ ముద్దు



డైనింగ్‌హాల్ వద్ద గోడకు అంటించిన పేపర్

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు క్యాంపస్‌లో ఉన్న ఫుడ్‌కోర్టును రెండు రోజుల పాటు బాయ్‌కాట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు విద్యార్థులు ఒకరికొకరు ఎనిమిది వేల మందికి వాట్సాప్‌లో సందేశాలు పంపించుకున్నారు. అంతేగాకుండా డైనింగ్ హాళ్ల వద్ద 'ఎఫ్‌సీ వద్దు... అవుట్‌సైడ్ ఫుడ్ ముద్దు.. శని, ఆదివారాలు ఫుడ్‌కోర్టును బాయ్‌కాట్ చేద్దాం' అంటూ పోస్టర్లను అంటించారు. దీంతో ఈ వ్యవహారం ట్రిపుల్‌ఐటీలో సంచలనంగా మారింది. గతంలో ఉన్న ఫుడ్‌కోర్టు నిర్వాహకులను ఏకపక్షంగా రద్దు చేసి, నూతన నిర్వాహకులకు ఫుడ్‌కోర్టును ఇచ్చినప్పటికీ ఏమాత్రం నాణ్యత పెరగకపోవడంపై విద్యార్థులు ఇలా వినూత్నంగా నిశ్శబ్ద నిరసన (సైలెంట్ ప్రొటెస్ట్) చేపట్టారు. విద్యార్థులు ఎవరైనా ఫుడ్‌కోర్టుకు వెళ్లినా ఏమీ కొనకుండా అక్కడ కూర్చోండని, రెండు రోజులు ఏమీ కొనకుండా నిరసన తెలిపితే సమస్యలు పరిష్కారమవుతాయంటూ ఫోన్‌లకు పంపుతున్న సందేశాల్లో పేర్కొన్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు శనివారం ఫుడ్‌కోర్టుకు వెళ్లలేదు. నిశ్శబ్ద నిరసన ఆదివారానికి మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్‌ను శనివారం ఆమె పరిశీలించారు. మొత్తం 3,15,261 మంది ఓటర్లు ఉండగా 440 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 3న ఇక్కడ కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, కాకినాడ జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు ఏలూరు జిల్లాకు చేరుకుంటాయని, వాటిని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచాలన్నారు. ఫలితాలు ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అంబరీష్ ఉన్నారు.

క్లుప్తంగా

కవి ప్రసాద్‌కు పురస్కారం


ఫత్తేపురంలో కవితా పురస్కారం అందుకుంటున్న కవి ప్రసాద్

తణుకు అర్బన్: మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్వోదయ మండలి నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన కవి, జిల్లా అభ్యుదయ రచయితల సంఘం మాజీ అధ్యక్షుడు వీఎస్‌వీ ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం అందజేశారు. ఫత్తేపురంలోని గాంధీ స్మారక భవనంలో గత నెల 30న జరిగిన జిల్లాస్థాయి కవితా రచనల పోటీల్లో మరో క్విట్ ఇండియా ఉద్యమం అనే కవితకు పురస్కారం దక్కినట్లు ప్రసాద్ తెలిపారు.

జాతీయ క్రీడలకు రిఫరీగా సూర్యనారాయణ



తణుకు అర్బన్ : ఉత్తరాఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ క్రీడల్లో మోడరన్ పెంటథ్లాన్ (రన్నింగ్, స్విమ్మింగ్) పోటీలకు రిఫరీగా తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ నెల 7 నుంచి 14 వరకు నిర్వహించే ఈ పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు సూర్యనారాయణ తెలిపారు.

రథసప్తమి వేడుకలకు ముస్తాబు


సూర్య, చంద్రప్రభ వాహనాలు ముస్తాబు చేసేందుకు వాహనశాల నుంచి బయటకు తీస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: రథసప్తమి వేడుకలకు శ్రీవారి క్షేత్రం ముస్తాబవుతోంది. అందులో భాగంగా శ్రీవారు, అమ్మవార్ల తిరువీధి సేవలకు వినియోగించే సూర్య, చంద్ర ప్రభ వాహనాలను దేవస్థానం సిబ్బంది వాహనశాల నుంచి శనివారం బయటకు తీశారు. వాటిని ఆదివారం శుభ్రం చేయనున్నారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 4న ఉదయం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు సూర్య ప్రభ వాహనంపై, అలాగే రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవలను కన్నులపండువగా నిర్వహిస్తామని ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.


మాజీ రాష్ట్రపతి వీవీ గిరి చేతుల మీదుగా పద్మశ్రీ అందుకుంటున్న రేలంగి (ఫైల్)


పద్మశ్రీ పురస్కారం తీసుకుంటున్న తాడేపల్లి వెంకన్న (ఫైల్)


పద్మశ్రీ తీసుకుంటున్న గరికిపాటి నరసింహారావు(ఫైల్)

గూడెంలో విరబూసిన పద్మాలు

- పలువురికి విభిన్న రంగాల్లో పద్మశ్రీ పురస్కారాలు
- హాస్యనటుడు రేలంగి, చిత్రకారుడు వెంకన్న ఈ ప్రాంతం వారే..
- ఆధ్యాత్మిక వేత్త గరికపాటికి 2022లో పద్మశ్రీ పురస్కారం
- 2024 సంవత్సరానికి బుర్రకథ టైగర్ మిరియాలకు అవార్డు

సండే స్పెషల్

తాడేపల్లిగూడెం : పద్మశ్రీ అవార్డుతో తాడేపల్లిగూడెం ప్రాంతానికి విడదీయలేని అనుబంధం.. గతంలో ఈ ప్రాంతానికి చెందిన పలువురు ప్రముఖులు విభిన్న రంగాల్లో పద్మశ్రీ పురస్కారం అందుకోగా.. తాజాగా బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావుకు అవార్డు రావడంతో పద్మశ్రీలకు తాడేపల్లిగూడెం కేరాఫ్‌గా మారింది. తాడేపల్లిగూడెం ప్రాంతంలో స్థిరపడిన ప్రముఖ హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య దాదాపు 300కు పైగా చిత్రాలలో నటించి 1970లో పద్మశ్రీ అందుకున్నారు. పద్మశ్రీ అందుకున్న తొలి తెలుగు హాస్యనటుడిగా రేలంగి వెంకట్రామయ్య కీర్తి గడించారు. కుంచెకు పదునుపెట్టి.. డ్రాయింగ్ మాస్టారుగా పేరుపొందిన పట్టణానికి చెందిన తాడేపల్లి వెంకన్న విద్యార్థులకు అక్షరాలు నేర్పుతూనే, బొమ్మలకు పరిపూర్ణత్వం తీసుకొచ్చారు. ఆయన 1992లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. ఇతిహాసాల ప్రాశస్త్యాన్ని వీనుల విందుగా వినిపిస్తూ.. రామాయణ, మహాభారత, భాగవతాలకు ప్రాచుర్యం కల్పిస్తూ, మూఢ నమ్మకాలను పారదోలేలా గరికపాటి చేసే ప్రసంగాలు వినసొంపుగా ఉంటాయి. ఆయన 2022లో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. వేలాది ప్రదర్శనలు ఇస్తూ బుర్రకథకు ప్రాచుర్యం కల్పించిన స్వర్గీయ మిరియాల అప్పారావు 2024లో పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు.

తాడేపల్లిగూడేనికి మకాం మార్చిన రేలంగి



తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం సమీపంలో 1910 ఆగస్టు 10న జన్మించిన రేలంగి వెంకట్రామయ్య.. హరికథ కథకుడిగా అరంగేట్రం చేశారు. హార్మోనియం కళాకారుడిగా పద్యాలకు, పాటలకు జీవం పోశారు. నటనపై ఆసక్తితో ఆయన ప్రయాణం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి మారింది. 1935లో సి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన 'శ్రీకృష్ణతులాభారం' సినిమా ద్వారా చిత్రరంగ ప్రవేశం చేసిన ఆయన విజయా సంస్థలో అవకాశాల ద్వారా వెనక్కితిరిగి చూడలేదు. హాస్యానికి, అభినయానికి రేలంగి చిరునామాగా మారారు. 1975లో 'పూజ' చిత్రంలో నటించే వరకు సుమారు 300 సినిమాలకు పైగా నటించారు. తన ఉన్నతికి బాసటగా నిలిచిన తాడేపల్లిగూడెంలో రేలంగి చిత్రమందిర్ సినిమా హాలును కట్టారు. తెలుగు చలన చిత్ర రంగంలో తొలి పద్మశ్రీ అవార్డు అందుకున్న హాస్యనటుడు ఆయనే.

బుర్రకథ టైగర్ మిరియాల



ప్రాచీన కళారూపమైన బుర్రకథకు ఖండాంతర ఖ్యాతిని ఆర్జించి పెట్టారు మిరియాల అప్పారావు. తూర్పుగోదావరి జిల్లా నడకుదురులో జన్మించిన ఆయన మన దేశంతో పాటు.. సింగపూర్ వంటి దేశాలలో బుర్రకథలతో ఆకట్టుకున్నారు. వైఎస్ఆర్ అచీవ్‌మెంటు అవార్డు పొందిన ఆయన వయోభారంతో తాడేపల్లిగూడెంలో కుమార్తె ఇంటికి చేరుకున్నారు. ఏడాదిలో 300 రోజుల పాటు ప్రదర్శనలిచ్చేవారు. 5000కు పైగా ప్రదర్శనలిచ్చిన మిరియాల అప్పారావు మరణానంతరం పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు.

కుంచెతో అలరించిన వెంకన్న



ఆయన గీసిన చిత్రం చూస్తే మైమరచిపోవాల్సిందే. ఆయన గీసిన ప్రతి బొమ్మలో జీవం ఉట్టిపడుతుంది. తాడేపల్లి వెంకన్న డ్రాయింగ్ టీచర్‌గా వృత్తిని కొనసాగిస్తూ.. ప్రవృత్తిగా చిత్రాలను గీస్తుండేవారు. విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన చిత్రాలకు దేశవ్యాప్త కీర్తి దక్కింది. 1992లో ఆయనను పద్మశ్రీ వరించింది. రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆయన తనయుల్లో ఒకరు ఓఎన్‌జీసీలో సీజీఎంగా విధులు నిర్వర్తిస్తుండగా, మరో ఇద్దరు అమెరికాలో స్థిరపడ్డారు.

చమక్కుల గరికపాటి



ఆయన ఇతిహాసాల్ని అవలీలగా ఔపోసన పట్టారు. ఆయన ప్రసంగంలో చమక్కులు, చతురత తక్కువేం ఉండదు. ఆయన అక్షరాల తో ఆడుకొనే ఘనాపాటి. ప్రసంగాలతో ఆకట్టుకునే దిట్ట. పెంటపాడు మండలం బోడపాడులో 1958 సెప్టెంబరు 14న వెంకటసూర్యనారాయణ, వెంకటరమణమ్మ దంపతులకు జన్మించిన గరికపాటి నరసింహారావు అవధానాలతో పేరొందారు. సహస్రావధానిగా రికార్డు సృష్టించారు. ఆధ్యాత్మిక వేత్తగా ప్రపంచం వ్యాప్తంగా పేరొందారు. 1972లో అవధానాలకు శ్రీకారం చుట్టిన ఆయన విదేశాల్లోనూ అనేక ప్రసంగాలు చేశారు. 2022లో రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

నత్తనడకన మెడికల్ కాలేజీ నిర్మాణాలు

- మూడో ఏడాదైనా భవనాలు ప్రారంభిస్తారా?
- గత ప్రభుత్వం హయాంలో శరవేగంగా పనులు


జీజీహెచ్ ప్రాంగణంలో కాలేజీ భవన నిర్మాణ పనులు


వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాలు

ఏలూరు టౌన్ : వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో ఏకంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు కేంద్ర అనుమతులు సాధించి.. తొలి దశలో ఏలూరుతో సహా మరో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభించారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలను రూ.525 కోట్ల వ్యయంతో కార్పొరేట్ తరహాలో నిర్మాణానికి చర్యలు చేపట్టారు. జీజీహెచ్‌లో శాశ్వత మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వైద్య విద్యార్థులకు హాస్టల్ భవనాలు సైతం అందుబాటులోకి రాకపోవటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పటంలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.60 కోట్లతో భవనం

వైఎస్సార్‌సీపీ హయాంలో తొలి ఏడాది ఎంబీబీఎస్ తరగతులకు యుద్ధప్రాతిపదికన రూ.60 కోట్లతో భవనాన్ని నిర్మించారు. 2023 సెప్టెంబర్‌2న ఫస్ట్ ఇయర్ క్లాస్‌లు ప్రారంభించి చిత్తశుద్ధిని చాటుకున్నారు. రెండో ఏడాది మెడిసిన్ క్లాస్‌లు ప్రారంభించేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం నానా తంటాలు పడింది. ఇక 2024 సెప్టెంబర్ నాటికి రెండో ఏడాది తరగతులు ప్రారంభమయ్యాయి. శాశ్వత భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. మొదటి ఏడాది 150 మంది, రెండో ఏడాది మరో 150 మంది విద్యార్థులు వైద్య కళాశాలలో చేరడంతో వారికి కనీసం హాస్టల్ వసతి కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. మూడో ఏడాదికైనా కాలేజీ ప్రధాన భవనాలు నిర్మాణం పూర్తి చేస్తారా? లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

వచ్చే ఏడాది కష్టాలు తప్పవు

ఏలూరు జీజీహెచ్‌లో మెడికల్ కళాశాల ప్రధాన భవనం సుమారు 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల్లో ప్రారంభించారు. యూనివర్శిటీ తరహాలో అత్యాధునిక సౌకర్యాలు, ల్యాబ్‌లు, క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేయనున్నారు. మెగా ఇన్‌ఫ్రా కంపెనీ నిర్మాణ బాధ్యతలు తీసుకోగా నిధుల మంజూరులో జాప్యంతో పనులు ముందుకు సాగటంలేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైద్య విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నారు. జీ ప్లస్–6 రెండు భవనాల నిర్మాణానికి సుమారు రూ.30 కోట్ల వరకూ వెచ్చిస్తున్నారు. ఇవన్నీ సకాలంలో పూర్తి చేయకుంటే వచ్చే ఏడాదికి వైద్య విద్యార్థులకు కష్టాలు తప్పవు.

భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలి



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ శాశ్వత భవనాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం హయాంలో జిల్లా వాసుల కలను నెరవేర్చుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ తీసుకువచ్చారు. గత ప్రభుత్వం హయాంలో భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల్లో జాప్యం ఏర్పడింది.

– కంభం విజయరాజు, చింతలపూడి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

హాస్టల్ భవనాలు పూర్తిచేయాలి



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులకు సకాలంలో హాస్టల్ సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. ఏపీ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కాంట్రాక్ట్ సంస్థ నిర్మాణ పనుల్లో వేగం పెంచి కనీసం మూడో ఏడాదికైనా పూర్తిస్థాయిలో వైద్య విద్యార్థులకు హాస్టల్ భవనాలు అందుబాటులోకి తేవాలి. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మెడికల్ కాలేజీ పేరు నిలబెట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– మేకా వెంకట ప్రతాప అప్పారావు, నూజివీడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

మెనూ సక్రమంగా అమలు చేయాలి


బూసరాజుపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకరనాయక్ అన్నారు. మండలంలోని బూసరాజుపల్లి గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు విద్యాబోధన, విద్యార్థులు అందిస్తున్న మెనూ వివరాలు, ఇతర మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత చదువుల్లో ముందుకు సాగాలని అన్నారు. పాఠశాలలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీడీ పీవీఎస్ నాయుడు, తహసీల్దార్ పీవీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

3న సామూహిక అక్షరాభ్యాసాలు

తాడేపల్లిగూడెం రూరల్: వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఈ నెల 3న వీరంపాలెం శైవక్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు శ్రీబాలా త్రిపుర సుందరి విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వసంత పంచమి మేధా సరస్వతి జన్మదినోత్సవమని, శుభాలకు ప్రతిరూపంగా ఈ పండుగను భావిస్తారని, ఈ పండుగ రోజు పసుపు వర్ణం దుస్తులు ధరించడం, పసుపు పూలు అమ్మవారికి సమర్పించడం శుభకరమన్నారు. వసంత పంచమి రోజున విచ్చేసే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆ రోజున చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేసి జ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

నరసాపురం రూరల్ : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని నరసాపురం రూరల్ ఏఎస్సై కేవీ సత్యనారాయణ తెలిపారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన కొపనాతి లక్ష్మణస్వామి(57)కి చేపల వేట జీవనాధారం. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి నరసాపురం నుంచి లక్ష్మణేశ్వరం మీదుగా వెళ్లే వేములదీవి చానల్‌లో వేటకు వెళ్లాడు. శుక్రవారం అతని ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం వేకువ జామున అదే కాలువలో అతడి మృతదేహం కనిపించింది. లక్ష్మణస్వామి మృతదేహాన్ని గుర్తు పట్టిన స్థానికులు విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేవీ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీలో అంగన్‌వాడీ టీచర్లు


ఉనికిలిలో అంగన్‌వాడీ టీచర్ పింఛను పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి : పింఛను పంపిణీ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలను కూడా ఉపయోగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలంలోని తిరుపతిపురం, ఉనికిలి గ్రామాల్లో ఇటీవల పింఛన్ల పంపిణీకి అంగన్‌వాడీ టీచర్లను వినియోగిస్తున్నారు. పంపిణీ సమయంలో రెండు రోజుల పాటు అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలను పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. శనివారం పింఛను పంపిణీలో భాగంగా మండలంలోని ఉనికిలి గ్రామంలో అంగన్‌వాడీ టీచరుతో పింఛను పంపిణీ చేయించారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం


ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించామని, అమలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమవరం పట్టణం అంబేద్కర్ చౌక్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన మానవ హారంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున మానవ హారంగా ఏర్పడి ప్లాస్టిక్ నిషేధంపై సందేశాన్ని అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ప్లాస్టిక్ నిషేధంపై సందేశాన్ని ప్రతిజ్ఞ చేయించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధం అమలుకు సహకరించాలని, ఉల్లంఘనకు పాల్పడే వారికి జరిమానాతో పాటు, చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మానవహారంలో పాల్గొన్న చిన్నారులు తల్లిదండ్రులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు తెలియజేయాలన్నారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ చుట్టుపక్కల ఉన్న షాపుల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ టి.త్రినాథరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం హాస్పిటల్స్‌కు గుర్తింపు


మాట్లాడుతున్న డాక్టర్ గోపాలరాజు, డాక్టర్ కృష్ణంరాజు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం హాస్పిటల్స్‌కు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ గుర్తింపు లభించిందని హాస్పటల్ చైర్మన్ డాక్టర్ గాదిరాజు గోపాలరాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేవీ కృష్ణంరాజు తెలిపారు. శనివారం ఆస్పత్రిలో వారు మాట్లాడుతూ నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్లమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు (డీఎన్‌బీ) పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నిర్వహణకు భీమవరం హాస్పిటల్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఇచ్చిందన్నారు. 20 ఏళ్ల క్రితం సువిశాల ప్రాంగణంలో ఈ ప్రారంభించామన్నారు. అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ గుర్తింపుతో ఎంబీబీఎస్ తరువాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ వైద్య విద్యను పశ్చిమగోదావరి జిల్లాలో మొట్ట మొదటిసారిగా ప్రారంభిస్తున్నామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ ఆపాలి


వర్గీకరణను నిరసిస్తూ మంగరాజు నిరాహార దీక్ష

పెంటపాడు: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం తక్షణం మానుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. శనివారం పెంటపాడులోని బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. మద్దతుగా దళిత సంఘాల నాయకులు పాల్గొని దీక్షకు సంఘీభావం ప్రకటించారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ స్వలాభం కోసం తప్ప దళితులను ఆదుకొనే ఉద్దేశం లేదన్నారు. ఆగస్టు 1 నాటికి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ క్లాసిఫికేషన్ వ్యవహారాలను పార్లమెంట్‌లో చర్చకు పెట్టి న్యాయం చేయాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీలకు 25 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ పెంచాలన్నారు. రాజ్యాంగ ధర్మ పరిషత్ ఫౌండర్ ఏఎస్ ఏడీ పాల్, తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య, ఏపీ మాలమహానాడు అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

పాఠశాల అభివృద్ధికి పాటుపడాలి


మండపాకలో పాఠశాల హెచ్‌ఎంకు స్పీకర్ సిస్టంను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తణుకు అర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం చదువుకున్న పాఠశాలకు వసతులు కల్పించడం అభినందనీయమని మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.మోహన్‌బాబు అన్నారు. మండపాక పాఠశాలలో శనివారం 2008 – 09 సంవత్సర పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు స్పీకర్ సిస్టంను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పాటుపడాలనే పూర్వ విద్యార్థుల తపన మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులను గ్రామ పెద్దలు ఆత్మకూరు రామకృష్ణ, జాన శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మోదుగ గుంటలో భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం


మోదుగ గుంట గ్రామంలో జరిగిన సమావేశానికి హాజరైన కార్మికులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం సంఘ అధ్యక్షుడు కే.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇఫ్టూజిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకే వినియోగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్మికులకు యాక్సిడెంట్, వివాహ, ప్రసూతి, భవన నిర్మాణ కార్మికులకు పనికిట్లు, స్కాలర్ షిప్ తొలగించిన పథకాలు పునరుద్ధరించాలన్నారు. కే.శ్రీనివాస్, పోసేంద్రప్రసాద్, పి.జాన్, వీరబాబు, సీహెచ్. జాన్, వెంకన్నబాబు, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఇద్దరిపై బైండోవర్ కేసులు


తాడేపల్లిగూడెం మండల మేజిస్ట్రేట్ కోర్టులో పాత నేరస్తులను బైండోవర్ చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇరువురిని మండల మేజిస్ట్రేట్ కోర్టులో బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలానికి బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా మద్యం అక్రమ రవాణా చేసినా, మద్యం బెల్ట్ షాపులు నిర్వహించినా తమకు తెలియజేయాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

భీమవరం: మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులంతా స్వీకరించే విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మధ్యాహ్నం భోజనం, పాఠశాల పారిశుద్ధ్య జిల్లా కోఆర్డినేటర్ కె కృష్ణారావు అన్నారు. శనివారం భీమవరంలోని చినరంగనిపాలెం పస్తులసాగరం మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్నం భోజనం, పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మెనూతో పాటు గుడ్లు, చిక్కీలు, రాగి జావ ఇస్తున్నందున బడి భోజనం చేయాలని కోరారు. స్కూల్లోని రికార్డులు, రిజిస్టర్లు బియ్యం, గుడ్లు, చిక్కీల నిల్వలు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు కోడి వెంకట్రావు పాల్గొన్నారు.

కుంటుపడ్డ పశు వైద్యం

- మూలనపడ్డ సంచార పశు ఆరోగ్యసేవ వాహనం
- ఇంటి గుమ్మంలోకి అరకొరగా అందుతున్న పశు వైద్యం
- 8 నెలలుగా వేల్పూరులో రోడ్డుపైనే వాహనం
- డ్రైవర్‌ను ఏర్పాటు చేయలేని వైనం
- గతంలో రైతులు మెచ్చిన పశు వైద్యసేవలు


వేల్పూరులో గేదెల ఫారమ్‌లో గేదెలు

తణుకు అర్బన్ : పశువులకు సత్వర వైద్యసేవలందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంచార పశు ఆరోగ్యసేవ వాహన సేవలు తణుకు నియోజకవర్గంలో కుంటుపడ్డాయి. పశు వైద్యానికి తణుకు నియోజకవర్గంలోని అత్తిలి, వేల్పూరు గ్రామాల్లో రెండు వాహనాలు అందుబాటులో ఉండేవి. కానీ గత కొన్ని నెలలుగా వేల్పూరులో అందుబాటులో ఉండాల్సిన వాహనం మూలనపడడంతో పశువైద్యసేవల్లో జాప్యం కలుగుతోందని రైతులు చెబుతున్నారు. వాహనంలో ఒక వైద్యుడితోపాటు ఒక పారా అసిస్టెంట్, డ్రైవరు ఉండాల్సి ఉంది. అయితే వేల్పూరులో ఉన్న వాహనానికి డ్రైవర్ లేకపోవడంతో వాహనం తిరగక సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదని తెలుస్తోంది. అందుబాటులో ఉన్న ఒక్క వాహనం ద్వారా పూర్తిస్థాయి వైద్యసేవలు అందక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పశువులను రైతులే ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకుని పశువైద్యశాలకు తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. గతేడాది జూన్ నెల నుంచి వేల్పూరులో ఉండే వాహనానికి డ్రైవర్ లేకపోవడంతో వాహనం మూలనపడినట్లు తెలుస్తోంది.

సేవల కోసం 1962

పశు వైద్యసేవలకు గత ప్రభుత్వం 1962 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే పశువులు ఉన్న ప్రాంతానికి వచ్చి వైద్యం చేసేవారు. వాహనంలో ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న పరికరాలు, ల్యాబ్ విభాగం అత్యాధునికంగా తీర్చిదిద్దబడ్డాయి. వాహనంలో ఉన్న ప్రత్యేక లిఫ్ట్ పరికరం ద్వారా గేదెలు, ఆవులను సైతం సులువుగా వాహనంలోకి ఎక్కించి వైద్యం చేస్తుంటారు. అంతేకాకుండా మెరుగైన వైద్యసేవలు అవసరమైన పశువులను వాహనం ద్వారానే పశు వైద్యశాలకు తీసుకువచ్చి వైద్యం చేసి తిరిగి ఇంటికి చేర్చే సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఒక్క వాహనమే అందుబాటులో ఉండడంతో పశువులకు సత్వర వైద్యం అందడంలేదని రైతులు వాపోతున్నారు.

గతంలో ఘనం..

మానవాళికి అజరామజరమైన సేవలందిస్తున్న 108 వాహనాలను దృష్టిలోపెట్టుకుని పశువుల ఫారమ్‌లు, పశుపెంపకాల ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలందించేందుకు 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా పశు వైద్యానికి సంచార వాహనాలను ప్రవేశపెట్టారు. అనతి కాలంలోనే ఈ సంచార వాహన వైద్యసేవలు రైతాంగం మన్ననలు పొందాయి. రెండు వాహనాల ద్వారా నిత్యం 20కి పైగా పశువులకు వైద్యసేవలు అందే పరిస్థితి ఉంది.

నియోజకవర్గంలో 28,600ల పశువులు

తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణంతోపాటు అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాలకు సంబంధించి ఆవులు 28,600 పశువులు ఉండగా, అందులో ఆవులు 3,855, గేదెలు 19,700, గొర్రెలు, మేకలు కలిపి 2544, పందులు 212, కుక్కలు 2,299 ఉన్నాయి.

ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	పందులు	కుక్కలు
అత్తిలి	965	6080	579	114	443
తణుకు రూరల్	683	5094	401	–	599
తణుకు అర్బన్	344	855	354	20	666
ఇరగవరం	1863	7671	1210	78	591


వేల్పూరులో ఎమ్మెల్యే ఇంటి వీధిలో రోడ్డుపై మూలనపడ్డ సంచార పశు ఆరోగ్యసేవ వాహనం

డ్రైవర్ లేక వాహన సేవలు నిలిచాయి

గత కొన్ని నెలలుగా సంచార పశు ఆరోగ్య సేవ వాహనానికి డ్రైవర్ లేకపోవడంతో వాహన సేవలు నిలిచాయి. వాహనం నిలిచిపోయిన విషయం ఉన్నతస్థాయి అధికారులకు తెలియచేశాం. నియోజకవర్గంలోని అత్తిలిలో అందుబాటులో ఉన్న మరొక వాహనం ద్వారా పశు వైద్యసేవలు అందుతున్నాయి. పశుపోషకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పశు వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ కె.నరసింహారావు, ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్, అత్తిలి

స్వచ్ఛంద సంస్థల సేవలు సద్వినియోగం చేసుకోండి


తణుకు ఎస్‌ఎన్‌వీటీ కళాశాలలో మైక్‌సెట్టు అందజేసిన మానవత సభ్యులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. తణుకులోని ఎస్‌ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన వైద్యులు డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు (జనతా రాజు) చేతుల మీదుగా మైక్ సెట్‌ను ప్రిన్సిపల్ వి.లక్ష్మి తులసికు అందజేశారు. కళాశాలలో వివిధ విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వినియోగపడేలా మైక్ సెట్‌ను అందజేశారు. గతంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెండు కొత్త కంప్యూటర్లను, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం నిమిత్తం రెండు దబరా గిన్నెలు, రెండు స్టీల్ డ్రమ్ములు బహూకరించారు. ఈ సందర్భంగా జనతా రాజును విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా ప్రతిభ పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, తణుకు మండలం అధ్యక్షురాలు కఠారి శారదాదేవి, వంగూరి హనుమంతరావు, కార్యదర్శి బల్లం రామకాశి, ఆలపాటి సుబ్బారావు, కె.వి.రమణమూర్తి, కఠారి విశ్వనాథరాజు, డాక్టర్ కె.రామలక్ష్మి, పులమాల వీరభద్రం, బోడపాటి ప్రసాద్, కె.మణిదీప్, మానవత సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొట్టు పరామర్శలు


తాడేపల్లిగూడెం రూరల్: మాజీ సర్పంచ్ కోనేటి దానయ్యను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు


పెంటపాడు: వింజమూరి నరసింహమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోనేటి దానయ్య తల్లి వెంకటరత్నం ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం దానయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పెద్దలు మృతి తీరని లోటని, ఇటువంటి సమయంలోనే కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బండారు నాగు తదితరులు ఉన్నారు.

వింజమూరికి మాజీ ఉపముఖ్యమంత్రి కేఎస్ఎన్ పరామర్శ

పెంటపాడు: కష్టకాలంలో పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పెంటపాడు మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ వింజమూరి శ్రీనివాస్ తండ్రి నరసింహమూర్తి ఇటీవల మృతి చెందడంతో శనివారం పార్టీ నాయకులతో కలిసి కొట్టు సత్యనారాయణ వింజమూరి శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు, కర్రి భాస్కరరావు, బండారు నాగు, మిరియాల శేషు, రావిపాడు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాల ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): రథసప్తమి సందర్భంగా పతాంజలి యోగాలయం ఆధ్వర్యంలో స్థానిక నల్లజర్ల రోడ్డు మాగంటి కల్యాణ మండపంలో ఈ నెల 4వ తేదీన మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సామూహిక సూర్య నమస్కారాల ప్రదర్శన జరుగుతుందని యోగాచార్యులు వింజుమూరి మాధవరావు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాల బాలికలకు యోగాసన పోటీలు జరుగుతాయని చెప్పారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన యోగ సాధకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారి స్వర్ణమయ పథకానికి రూ.లక్ష విరాళం


దాత కాళిదాస్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.1,00,001 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన డి.కాళిదాస్ ముందుగా ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈసందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అనంతరం దాత దంపతులకు స్వామివారి ప్రత్యేక దర్శన భాగ్యాన్ని కల్పించారు.

సంక్షేమ పథకాలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న పోలిరాతి ఆదినారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలకు కార్మికులకు సిద్ధంగా ఉండాలని తాడేపల్లిగూడెం ప్రాంతీయ తాపీ వడ్రంగి సెంట్రింగ్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిపాయిపేటలోని యూనియన్ నెలవారి సమావేశం శనివారం యూనియన్ ప్రధాన కార్యదర్శి అత్తిలి బాబి అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన విజయవాడలో జరుగు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు కార్మికులందరూ మద్దతు తెలపాలన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల శ్రీనివాస్, యూనియన్ నాయకులు ఎం.జేమ్స్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కోడె సాయి బాలాజీ, సనమండ్ర విజయ్, పాలూరి రాంబాబు పాల్గొన్నారు.

స్టెమ్ కోర్సులపై పట్టు సాధించాలి


ఏపీ నిట్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్లానింగ్ అండ్ డెవలప్ మెంటు అధికారి వి.సందీప్

తాడేపల్లిగూడెం: ఇంజనీరింగ్, సైన్సు టెక్నాలజీ గణితం వంటి స్టెమ్ కోర్సులపై విద్యార్థులు పట్టు సాధించాలని శనివారం నిట్‌ను సందర్శించిన విద్యార్థులకు డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంటు అధికారి వి.సందీప్ తెలిపారు. ఏలూరులోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులకు నిట్‌లో పలు విషయాల గురించి వివరించారు. దేశ పురోగతిలో టెక్నాలజీ ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఉద్యోగాలు కోసం చూసే వారుగా కాకుండా, ఉద్యోగాలు సృష్టించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కృత్రిమ మేథ, మెషీన్ లెర్నింగ్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిట్ ప్రాంగణంలోని భవనాలను విద్యార్థులు సందర్శించి సంతృప్తి చెందారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి


చినఅమిరంలో ఇమ్మాన్యుయేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి కేటాయిస్తే మానవతా దృక్పథంతో అనాథ పిల్లలను ఆదుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇమ్మాన్యుయేట్ చిల్డ్రన్ హోమ్‌లో శనివారం 50 మంది విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారికి సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు రగ్గులు అందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా చినఅమిరం శాఖ మేనేజర్ జయంతు కుమార్‌ను అభినందించారు.

ఘనంగా ప్రారంభమైన మందేశ్వరస్వామి పునఃప్రతిష్ఠ పూజలు

పెంటపాడు: మండలంలోని వల్లూరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మందేశ్వరస్వామి పునః ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వేదుల వెంకటేష్ ఆధ్వర్యంలో అర్చకులు పూజ్యం గంగాధర, సత్యనారాయణ సోదరుల సమక్షంలో పరిమెళ్లకు చెందిన వేదపురోహితులు బాధంపూడి ఫణిశర్మ బ్రహ్మత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు కొలువుకానున్న మందేశ్వరునికి యాగశాల ప్రదక్షణ, భూతబలి, పుణ్యాహవచనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చీమలకొండ సాయి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పోడూరు: పర్యావరణ పరిరక్షణకు వృక్షసంపదను పెంచాలని వద్దిపర్రు ఎంపీటీసీ మాజీ సభ్యుడు శీలం శ్రీనివాస్ అన్నారు. గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వద్దిపర్రు శివారు చింతగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడడానికి వృక్ష సంపద దోహదపడుతుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దేవునికి లోబడి జీవించాలి


దైవసేవకులను సన్మానిస్తున్న విశ్వాసులు

పెంటపాడు: తణుకు ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్(ఈపీఎఫ్)లో గత నెల 30 నుంచి జరుగుతున్న విజ్ఞాపన సమావేశాలు శనివారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పరస మోజస్ ప్రవీణ్ విశ్వాసులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేవునికి విధేయులై విజ్ఞాపనలు తప్పక చేయాలన్నారు. దీంతో పాటు ఆధ్యాత్మిక జీవనంతో జీవించాలన్నారు. ఈ సందర్భంగా ముగింపు పురస్కరించుకొని విశ్వాసులు దైవసేవకుల కుటుంబాన్ని సన్మానించారు. శనివారం రాత్రి 9 గంటల నుంచి సంపూర్ణ రాత్రి ప్రార్థన విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు పరస అరుణకుమారి, దైవసేవకురాలు ఫైజీ, రాజమండ్రికి చెందిన పాస్టర్ డాక్టర్ నవీన్ బాబు, సేవకురాలు షారోన్‌జ్యోతి, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఫిబ్రవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ భీమవరం పట్టణంలోని పలు వైన్ షాపులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాంబే స్వీట్స్ సెంటర్, అంబేడ్కర్ సర్కిల్, కొత్త బస్టాండు, చిన్న రంగనిపాలెం, విస్సా కోడేరు వంతెన ప్రాంతాల్లోని మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్లాస్టిక్ గ్లాసులను, ప్లాస్టిక్ బాటిళ్లు కలిగి ఉండడం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్న విషయం మీకు తెలుసా లేదా అని ప్రశ్నించారు. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కలిగి ఉన్న ఈ ఆరు షాపులపై జరిమానాకు సిఫార్సు చేస్తూ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా షాపుల వద్ద తాగడానికి (లూజ్ సేల్స్) ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నిస్తూ, ఇటువంటి వైన్ షాపులపై కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

ఈ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- భయాందోళనతో వాహనదారుల ప్రయాణం


అత్తిలి- అలంపురం మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

అత్తిలి: ఆర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న ప్రమాదకర మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. తణుకు-భీమవరం మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిలో అత్తిలి మండలం కె సముద్రపుగట్టు, పాలూరు, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం గ్రామాల పరిధిలో మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్తిలి- అలంపురం, ఉరదాళ్లపాలెం-దువ్వ అర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు గాయాల పాలౌతున్నారు. ఇటీవల కాలంలో బల్లిపాడు సమీపంలో ఉన్న మలుపువద్ద కారు వేగంగా వచ్చి మలుపు గుర్తించక పక్కనే ఉన్న మురుగుడ్రెయిన్‌లోకి దూసుకెళ్లింది. ఇదే ప్రాంతంలో వారం వ్యవధిలో రెండు పర్యాయాలు కారు ప్రమాదాలు జరిగాయి. ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు కానీ, స్పీడ్ బ్రేకర్‌లు లేక పోవడంతో ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని మలుపుల వద్ద రోడ్డు వెంబడి చెట్లు, ముళ్ల పొదలు అల్లుకుపోవడంతో ఎదురుగా వచ్చేవాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రిసమయాల్లో మలుపుల వద్ద అనేక మంది ప్రయాణికులు అదుపు తప్పి జారిపడి క్షతగాత్రులు అయిన సంఘటనలు అనేకం జరిగాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


అత్తిలి మండలం కె సముద్రపుగట్టు వద్ద మలుపు


అత్తిలి- అలంపురం మార్గంలో అదుపు తప్పి మురుగు డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కారు(ఫైల్)